గద్దెకు చేరిన సారలమ్మ

● జాతరలో భక్తుల మొక్కులు


స్టేషన్‌ఘన్‌పూర్: ఇప్పగూడెంలో సారలమ్మను గద్దెపైకి తీసుకొస్తున్న కోయపూజారులు


స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండలో..


తరిగొప్పుల: కంకవనం తీసుకొస్తున్న కోయ పూజారులు


బచ్చన్నపేట: మన్‌సాన్‌పల్లిలో..


చిల్పూరు: లింగంపల్లిలో..


చిల్పూరు: గద్దెల వద్ద పూజారితో అధికారులు


స్టేషన్‌ఘన్‌పూర్: మొక్కులు చెల్లిస్తున్న భక్తులు


చిల్పూరు: విరాళం ఇస్తున్న రాజయ్య


నర్మెట: అమ్మాపూర్‌లో..

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండ, జిట్టిగూడెం గ్రామ పంచాయతీల పరిధిలోని సమ్మక్క–సారలమ్మ మినీ మేడారం జాతరలో, ఇప్పగూడెం, రంగరాయగూడెం, కోమటిగూడెం, అక్కపెల్లిగూడెం గ్రామాల పరిధిలోని శ్రీచింతగట్టులో బుధవారం సాయంత్రం వనదేవత సారలమ్మ గద్దెపై కొలువుదీరింది. జాతర కమిటీ బాధ్యులు, ప్రత్యేక అధికారులు, పోలీసు బందోబస్తు నడుమ చేపడుతున్న జాతరలో కోయపూజారులు గుట్టపై నుంచి సారలమ్మను ఆదివాసీల సంప్రదాయాలతో ప్రత్యేక పూజల నడుమ గద్దెపైకి చేర్చారు. తాటికొండ జాతరలో వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, చైర్మన్ కె.మహేందర్, ఇప్పగూడెం జాతరలో జాతర కమిటీ మాజీ చైర్మన్ మందపురం ఎల్లగౌడ్, కమిటీ బాధ్యుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, ఈఓ లక్ష్మీప్రసన్న, నాయకుల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయగా పోలీసు బందోబస్తు పర్యవేక్షణలో సారలమ్మను గద్దెపైకి తీసుకువచ్చారు. సారలమ్మ గద్దెపైన కొలువుదీరిన అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాలకు చెందిన భక్తులు సారలమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

మండలంలోని ఇప్పగూడెం సమ్మక్క–సారలమ్మ జాతరలో బుధవారం సీసీ కెమెరాలను ఏర్పాటు చేయగా సీఐ ముస్క రాజు, ఎస్సై నాగరాజు ప్రారంభించారు.

తరిగొప్పుల మండలంలో..

తరిగొప్పుల: మండలంలోని బొంతగట్టునాగారం, బొత్తలపర్రె మినీ మేడారం జాతరలో తొలి ఘట్టం ఉద్విగ్నభరితంగా సాగింది. వనదేవత సారలమ్మ బుధవారం రాత్రి గద్దెపైకి చేయడంతో జాతర సంరంభం అంగరంగ వైభవంగా మొదలయ్యింది. సారలమ్మతో పాటు పగిడిద్ద రాజు, గోవిందరాజులు గద్దెపైకి చేరడంతో కోలాహలం నెలకొంది. బిడ్డరాకతో భక్తిభావంతో భక్త జనం ఊగిపోయారు. జాతరలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై శ్వేత, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. జాతర నిర్వహణ కమిటీ అధ్యక్షుడు సభావత్ రాజు, ఉపాధ్యక్షుడు నాం శ్రీనివాస్, ఎంపీటీసీ భూక్య జుంలాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మాపురంలో..

నర్మెట: మండలంలోని అమ్మాపురం గ్రామంలో సమక్క–సాలరమ్మ జాతరలో బుధవారం సారలమ్మ, పడిగిద్ద రాజులు గద్దెల మీదకు చేరుకున్నారు. కోయ పూజారులు ఘనంగా పూజలు నిర్వహిస్తూ సారలమ్మను గద్దెపైకి తీసుకువచ్చారు. వనదేవత గద్దెపైకి రాగా భక్తులు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుంటి జగన్‌మోహన్, ఎంపీటీసీ లింగాల లక్ష్మి సిద్దయ్య, బి. భూపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ బైరగోని సురేందర్, మాజీ ఉప సర్పంచ్ బైరగోని లక్ష్మయ్య, కుంటి రమేష్, బోగా అంజయ్య, గంగం సుధాకర్‌రెడ్డి, వడ్ల బాలనర్సు, బైరగోని రాజుతోపాటు తదితరులు పాల్గొన్నారు.

చిల్పూరు మండలంలో..

చిల్పూరు: మండలంలోని దేవాదాయ శాఖ పరిధిలోని లింగంపల్లితో పాటు శ్రీపతిపల్లి–కొండాపూర్, చిల్పూరు, గార్లగడ్డతండ–ఫత్తేపూర్ గ్రామాల్లో నిర్వహిస్తున్న జాతరల్లో బుధవారం సాయంత్రం సారలమ్మను పూజారులు గద్దెలకు తీసుకొచ్చారు. లింగంపల్లిలో ఏసీపీ సుందరగిరి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో పోలీసుల బందోబస్తునడుమ సారలమ్మను గద్దెకు చేరుకోగానే ఈఓ చిందం వంశీ, ఉత్సవ కమిటీ చైర్మన్ కండ్లకోలు బాలరాజు, వైస్ చైర్మన్ రావులపల్లి వెంకన్న, ఎస్సై వినయ్‌కుమార్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజేందర్‌రెడ్డి, కుర్రెంల మోహన్, ఎంపీఓ మధుసూదన్, కార్యదర్శులు పూల శ్రీకాంత్, పిట్ట బాబు, అపరాదపు రాజులు పాల్గొన్నారు. అలాగే శ్రీపతిపల్లి జాతరలో చైర్మన్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, వైస్ చైర్మన్ పుట్ట రాజు, చిల్పూరులో చైర్మన్ బోళ్ల రాజ్‌కుమార్, ఎంపీపీ సరితబాలరాజు, మాజీ సర్పంచ్ ఉద్దెమారి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా లింగంపల్లి జాతరలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఏసీపీ సుందరగిరి శ్రీనివాసరావు ప్రారంభించారు.

గద్దెల వద్ద ఒడి బియ్యం మొక్కు

సమ్మక్క–సారలమ్మ జాతరను పురస్కరించుకుని బుధవారం అమ్మవార్ల గద్దెల వద్ద ఒడిబియ్యం సమర్పించారు. మండల కేంద్రానికి చెందిన జాతర వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్–విమల, తోట శంకరయ్య–వెంకటమ్మ, శ్రవణ్‌కుమార్ దంపతులు ఒడిబియ్యం ఎత్తుకోగా కోయ పూజారి లింగస్వామి, చైర్మన్ బోళ్ల రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో డప్పుచప్పుళ్ల నడుమ గద్దెల వద్దకు తీసుకెళ్లారు.


జఫర్‌గఢ్: మొక్కులు చెల్లిస్తున్న దాతలు, గ్రామస్తులు

సారలమ్మ గద్దె నిర్మాణానికి విరాళం

చిల్పూరు మబ్బుగుట్ట వద్ద నిర్వహిస్తున్న సమ్మక్క–సారలమ్మ జాతర ప్రాంగణంలో సారలమ్మ గద్దె నిర్మాణానికి గ్రామానికి చెందిన నారగోని బుచ్చమ్మ–రాజయ్య దంపతులు చైర్మన్ బోళ్ల రాజ్‌కుమార్‌కు రూ.60 వేలు విరాళం అందజేశారు.

గద్దెలపై ప్రతిమల పునఃప్రతిష్ఠాపన

జఫర్‌గఢ్: మండల కేంద్రంలో గుట్టపై వెలసిన సమ్మక్క–సారలమ్మల ప్రతిమలను గద్దెలపై భక్తిశ్రద్ధలతో గ్రామస్తులు బుధవారం పునఃప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా తల్లులకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. గద్దెలను దాతలు కుల్లా చెన్నయ్య, కుల్లా గోవర్దన్, కుల్లా కర్ణాకర్ కుటుంబ సభ్యులు నిర్మించారు. కార్యక్రమంలో అన్నెబోయిన భిక్షపతి, జ్యోతి యాకయ్య, సముద్రాల మల్లయ్య, బజ్జూరి చలమయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

మన్‌సాన్‌పల్లిలో..

బచ్చన్నపేట: మండలంలోని మన్‌సాన్‌పల్లిలో నిర్వహిస్తున్న మినీ మేడారం జాతరలో సారలమ్మకు భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. గుట్టపై వెలిసిన తల్లులను పక్కగుట్టపై నుంచి కోయపూజారులు శివసత్తుల పూనకాలు, భక్తుల నీరాజనాల నడుమ తీసుకొచ్చి గద్దెలపై ప్రతిష్ఠిస్తారు. జాతరలో భాగంగా బుధవారం సారలమ్మను గద్దెపైకి తీసుకొచ్చి పూజలు చేశారు.

అద్దె బస్సు డ్రైవర్ల ఆందోళన


ఆందోళన చేస్తున్న అద్దె బస్సు డ్రైవర్లు, క్లీనర్లు

జనగామ: అద్దె బస్సుడ్రైవర్లు, క్లీనర్ల వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆందోళనకు దిగారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు, జిల్లా అధ్యక్షుడు బొట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జనగామ ఆర్టీసీ డిపో ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నా ఫలితం లేదన్నారు. రోజువారీగా ప్రయాణించే కిలో మీటర్ల లెక్కన నెల వారి వేతనాలు ఇవ్వడంతో పాటు క్లీనర్లకు రూ.5,500 ఇవ్వాలని కోరారు. అలాగే ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించకపోవడం దారుణమన్నారు. ప్రతీ సంవత్సరం ఒక నెల వేతనం బోనస్‌గా చెల్లించడంతో పాటు అద్దె బస్సు యాజమాన్యం శ్రమ దోపిడీని అరికట్టాలన్నారు. డ్రైవర్లు, క్లీనర్లు ఆందోళన చేస్తున్నారనే విషయం తెలుసుకున్న డిపో మేనేజర్ జ్యోత్స్న చర్చలు జరపగా విఫలమయ్యాయి. ఏసీపీ దామోదర్‌రెడ్డి అక్కడకు చేరుకుని వారితో మాట్లాడారు. ఈ విషయమై అద్దె బస్సు యజమానులను మార్చి 2వ తేదీన పిలిపించి మాట్లాడుతామని, ఆందోళన విరమించాలని కోరగా వారు అంగీకరించడంతో సమస్య తాత్కాలికంగా సద్దుమణిగింది. జోగు ప్రకాష్, ఇర్రి అహల్య, వెంకట మల్లయ్య, బిక్షపతి, రాజు, వెంకటేశ్వర్లు, కొమరయ్య, రమేష్, వెంకటరెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

మాతృభాషపై మక్కువ పెంచుకోవాలి


మాతృభాషా దినోత్సవంలో ఉపాధ్యాయులు

జనగామ రూరల్: ప్రతి ఒక్కరు మాతృభాషపై మక్కువ పెంచుకోవాలని ధర్మకంచ పాఠశాల ప్రధానోపాధ్యాడు జి. శ్రీనివాస్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడారు. కార్యక్రమంలో భాషా పండితుడు శేషకుమార్, భవానీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రషర్ ఏర్పాటుపై కలెక్టర్ విచారణ


స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

రఘునాథపల్లి: మండలంలోని భానాజీపేట–రఘునాథపల్లి శివారులోని పిట్టలగూడెం సమీపంలో స్టోన్ క్రషర్ ఏర్పాటుపై వివాదాస్పదం కావడంతో కలెక్టర్ శివలింగయ్య బుధవారం విచారణ చేపట్టారు. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి క్రషర్ నిర్మాణం కోసం ఐదేళ్ల క్రితం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నాడు. దీనికి అటవీ, మైనింగ్, జిలెటిన్‌స్టిక్స్ ఎక్స్‌ప్లోజివ్, రెవిన్యూ, పర్యావరణ వంటి శాఖల నుంచి ఎన్‌ఓసీలు రావాల్సి ఉంది. అయితే కొన్ని శాఖలు అనుమతులకు నిరాకరించాయి. దీంతో సదరు వ్యక్తి హైకోర్టును ఆశ్రయించాడు. హైకోర్టు ఆదేశాల మేరకు కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో కలిసి బుధవారం సంబంధిత స్థలం వద్దకు వెళ్లి విచారణ చేపట్టారు. కలెక్టర్ వస్తున్న సమాచారంతో ఉదయం నుంచి పిట్టలగూడెం వాసులతో పాటు రోమన్ క్యాథలిక్ క్రిస్టియన్ అసోసియేషన్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. క్రషర్ ఏర్పాటు చేసుకున్న స్థలం క్రిస్టియన్స్ సొసైటీకి చెందిన శాంతిగిరి దేవాలయానికి అనుకొని ఉన్నదని, అదే విధంగా పిట్టలగూడేనికి దగ్గరగా ఉందని, ఇక్కడ క్రషర్ నిర్మాణం చెపట్టొద్దని నిరసన తెలిపారు. కాగా, కలెక్టర్ స్థలాన్ని పరిశీలించి అనుమతులు ఇవ్వాలా.. వద్దా అనే దానిపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, తహసీల్దార్ యుగేందర్, నిరసన తెలిపిన వారిలో ఎంపీటీసీ సోమనాథ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'వేద'లో ఉచిత స్వర్ణ ప్రాశణ


చిన్నారులకు స్వర్ణప్రాశణ వేస్తున్న డాక్టర్ అంజిరెడ్డి

జనగామ: జిల్లా కేంద్రం హైదరాబాద్ రోడ్డులోని వేద ఆయుర్వేదిక్ పంచకర్మ, వెల్నెస్ సెంటర్‌లో బుధవారం 0–16 సంవత్సరాల చిన్నారులకు స్వర్ణ ప్రాశాన్ని ఉచితంగా వేశారు. ఆస్పత్రి డాక్టర్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో 90 మంది పిల్లలకు స్వర్ణ ప్రాశం వేసిన తర్వాత మాట్లాడారు. ప్రతి నెల పుష్యమి నక్షత్రం రోజు ఉదయం 7 నుంచి 8 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. స్వర్ణ ప్రాశం తీసుకోవడం వలన జీర్ణశక్తి వృద్ధి, అన్ని రకాల అలర్జీలు తొలగడం, కండరాలు, ఎముకల పటిష్టత, మేథాశక్తి పెంపొందించడంతోపాటు చర్మ కాంతి పెరిగేలా చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది ఉన్నారు.

సీఎంఏలో విజయ్‌కుమార్‌కు ఆలిండియా 24వ ర్యాంకు



రఘునాథపల్లి: ఖిలాషాపూర్ గ్రామానికి చెందిన బాల్నె విజయ్‌కుమార్ బుధవారం విడుదల చేసిన సీఎంఏ (కాస్ట్ అండ్ మెనేజ్‌మెంట్ అకౌంటెంట్) కోర్సులో ఆల్ ఇండియా 24వ ర్యాంకు సాధించాడు. చదువులో చురుకుగా ఉన్న విజయ్ 6 నుంచి 10 వరకు వెల్ది మోడల్ స్కూల్‌లో, మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యాభ్యాసం చేశాడు. తల్లి మాదవి మృతి చెందగా తండ్రి మల్లేష్, తాత రాజయ్య ప్రోత్సాహంతో మెరిట్ సాధించినట్లు విజయ్‌కుమార్ తెలిపారు. ఆల్ ఇండియా ర్యాంకు సాధించిన విజయ్‌కుమార్‌ను గ్రామస్తులు అభినందించారు.

స్వయంపాలన దినోత్సవం



బచ్చన్నపేట: మండల కేంద్రంలోని వాణి ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు చెప్పి ప్రతిభను కనబరిచారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ప్రిన్సిపాల్ భాస్కరుని సుమలత, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

జనగామ రూరల్: విద్యార్థులు చదువులతో పాటు శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించాలని ఎంపీపీ కళింగరాజు అన్నారు. బుధవారం మండలంలోని శామీర్‌పేట ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన స్వయంపాలన దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి బోధించారు. హెచ్ఎం కలకం సుధీర్‌రెడ్డి, అశ్విని, ఫాతిమమేరి, నీలిమ, శ్రీనాథ్ పాల్గొన్నారు.

కనులపండువగా మడేలయ్య ఉత్సవాలు



బచ్చన్నపేట: మండల కేంద్రంలో రజకుల ఆరాధ్య దైవమైన మడేలయ్య ఉత్సవాలు బుధవారం కనుల పండువగా ప్రారంభమయ్యాయి. రజక సంఘం ఆధ్వర్యంలో కుటుంబాలు ప్రత్యేకమైన దుస్తులు ధరించి మడేలయ్యకు బిందెలతో నీళ్లను తీసుకెళ్లి ఉత్సహ విగ్రహాలకు జలాధివాసం చేశారు. విగ్రహాలను గ్రామంలో ఊరేగించి కొత్తగా నిర్మించిన ఆలయంలో ప్రతిష్ఠించారు. 22న హోమాలు, 23న పోచమ్మకు బోనాలు, 24న మడేలయ్య కల్యాణం, 25న బలిహరణతో ఉత్సవాలు ముగుస్తాయని కుల పెద్దలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మండల విద్యార్థి ఎంపిక



నర్మెట: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రభుత్వ మోడల్ స్కూల్ విద్యార్థి అరె సాయివంశీ ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ టి.శరత్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం జిల్లా స్థాయిలో గెలుపొందిన సాయివంశీకి రూ.1,500 నగదుతో పాటు ప్రశాంసా పత్రాన్ని అందజేశారు.

నియామకం



తరిగొప్పుల: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షురాలిగా మండలకేంద్రానికి చెందిన చొక్కారపు రమాదేవిని నియమిస్తున్నట్లు రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కోఆర్డినేటర్ నీలం పద్మ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బడిక ఇందిర, జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా బుధవారం నియామక పత్రాన్ని రమాదేవి అందుకున్నారు.

యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా నాగరాజం


నాగరాజం, జంపయ్య

రఘునాథపల్లి: తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) మండల అధ్యక్షుడిగా మండలంలోని మాధారం పాఠశాల హెచ్ఎం చిదురాల నాగరాజం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన టీఎస్ యూటీఎఫ్ మండల మహాసభకు ఎన్నికల అధికారిగా జ్యోతి శ్రీహరి, పరిశీలకులుగా సి.ఇన్నారెడ్డి వ్యవహరించారు. వీరి సమక్షంలో జరిగిన ఎన్నికలో అధ్యక్షుడిగా నాగరాజం, మండల ప్రధాన కార్యదర్శిగా టేకులపల్లి జంపయ్య, ఉపాధ్యక్షులుగా ఏ శ్రీనివాస్‌లు, కొన్సల తీనా, కోశాధికారి బి పవన్‌కుమార్, కార్యదర్శులుగా భాస్కరాచారి, నర్సింహులు, విజయ, వినోద, వెంకటేశ్వర్లు, చక్రధర్‌లు ఎన్నికయ్యారు.

ఆటోడ్రైవర్ ఔదార్యం

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్ కేంద్రానికి చెందిన ఆటోడ్రైవర్ గజవెల్లి రాజమౌళి తన ఆటోలో బుధవారం రెండు తులాల బంగారం, రూ.50వేలు నగదు ఉన్న పర్సును మర్చిపోయిన మహిళకు అందించి ఔదార్యాన్ని చాటుకున్నాడు. కాగా బంగారం, డబ్బులు ఉన్న పర్సును నిజాయితీగా ప్రయాణికురాలికి అందించిన ఆటోడ్రైవర్‌ను పలువురు అభినందించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

రఘునాథపల్లి: గ్రామాలను అభివృద్ధి పథంలోకి తీసుకరావడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు జిల్లా జెడ్పీటీసీల ఫోరం అధ్యక్షుడు బొల్లం అజయ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పదో వార్డులో తన నిధులతో నిర్మిస్తున్న డ్రెయినేజీ పనులను ప్రారంభించారు.

సంక్షిప్త సమాచారం

23న రెవెన్యూ ఉద్యోగులకు సెలవు ప్రకటించాలి

బచ్చన్నపేట: ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరుగుతున్న మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర సందర్భంగా ఈ నెల 23వ తేదీన రెవెన్యూ ఉద్యోగులకు సెలవు ప్రకటించాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్, నాన్‌గెజిటెడ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రవి ప్రభుత్వాన్ని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తికి అంత్యక్రియలు



జనగామ: ఇటీవల రైలు నుంచి కింద పడి మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహానికి జమాత్ షబాబ్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం అంత్యక్రియలు నిర్వహించి ఖననం చేశారు. గత మూడు రోజులుగా జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి పోస్టుమార్టం గదిలో భద్రపరిచిన మృతదేహన్ని జీఆర్‌పీ పోలీసులు ముస్లిం పెద్దలకు అందించారు. గుర్తు తెలియని వ్యక్తిగా గురించి ఎవరూ రాకపోవడంతో జీఆర్‌పీ ఆదేశాల మేరకు కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్ షఖీల్, ఉపాధ్యక్షులు ఎండి అజహరొద్దీన్, జహంగీర్, అజం తదితరులు ఖన నం చేసి, ఆయన ఆత్మ శాంతి కోరుతూ ప్రార్థనలు చేశారు.

డీసీఎం వ్యాన్ బోల్తా

జనగామ రూరల్: వరంగల్–హైదరాబాద్ నేషనల్ హైవే మండలంలోని పెంబర్తి యూటర్న్ వద్ద మక్కల లోడ్‌తో వెళ్తున్న డీసీఎం వ్యాన్ బోల్తా పడిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. కాగా, వాహనాన్ని డ్రైవర్ కాకుండి క్లీనర్ అజాగ్రత్తతో నడపడం వల్ల బోల్తా పడింది. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు చేరుకొని రోడ్డుపై డీసీంను తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

తల్లుల చెంతకు పల్లె జనం

రఘునాథపల్లి: మేడారం జాతరలో సమ్మక్క–సారలమ్మ తల్లులను దర్శించుకునేందుకు పల్లెజనం బుధవారం పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. రఘునాథపల్లిలో జెడ్పీటీసీ బొల్లం అజయ్ తల్లులకు ఎత్తు బంగారాన్ని సమర్పించారు.

భక్తుల సురక్షిత ప్రయాణానికి పోలీసుల చర్యలు

దేవరుప్పుల: మేడారం సమ్మక్క–సారలమ్మ కుంభమేళా జాతరకు వెళ్లే భక్తుల సురక్షిత ప్రయాణం కోసం పోలీసు యంత్రాంగం పలు జాగ్రత్తలతో కూడిన సూచనలతో పలు చోట్ల బుధవారం అవగాహన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఎస్సై ఎస్.చెన్నకేశవులు, పోలీసు సిబ్బంది యాకుబ్, యాకేష్ తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ చోరీ

బచ్చన్నపేట: మండల కేంద్రంలో దుండగులు రైతుల వ్యవసాయ బావుల వద్ద కేబుల్‌ను చోరీ చేసిన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. కట్కూర్ గ్రామానికి వెళ్లే దారిలోని దిడ్డిగ రమేష్, లచ్చయ్య, అంజయ్య, భాస్కర్, లక్ష్మయ్య, కొమురయ్య, మల్లారెడ్డి, ఆజామ్, వెంకటయ్య, లచ్చినారి పాటు పలువురు రైతులకు చెందిన బావుల వద్ద స్టాటర్ నుంచి బోరు మోటరులకు వెళ్లే కేబుల్‌ను దుండగులు ఎత్తుకెళ్లినట్లు బాధిత రైతులు వాపోయారు. కాగా, ఎస్సై కంకల సతీష్ మాట్లాడుతూ అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు.

పండ్ల పంపిణీ

దేవరుప్పుల: ప్రముఖ వైద్యుడు, టీపీసీసీ సభ్యుడు లాకావత్ లక్ష్మీనారాయణనాయక్ జన్మదినం పురస్కరించుకొని కాంగ్రెస్ అనుబంధ ఎస్టీ సెల్ నాయకులు పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. బుధవారం మండలంలోని సీతారాంపురం అనాథ శరణాలయంలో కాంగ్రెస్ మహిళ విభాగం నాయకురాలు కునుసోతు సావిత్రి ఆధ్వర్యంలో కేక్‌కట్‌చేసీ పండ్లు పంపిణీ చేశారు.

వెంకట్‌రెడ్డి మృతి తీరని లోటు

పాలకుర్తి టౌన్: నారాబోయిన గూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త రెంటల వెంకట్‌రెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని కొడకండ్ల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ అన్నారు. బుధవారం గుండెపోటుతో మృతి చెందని వెంకట్‌రెడ్డి మృతదేహంపై పూలమాల వేసి నివాళ్లులర్పించారు.

గీతకార్మికుడికి తీవ్రగాయాలు

దేవరుప్పుల: ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్రగాయాలైన సంఘటన బుధవారం కోలుకొండలో చోటుచేసుకుంది. కోలుకొండుకు చెందిన భాష్యంపెల్లి రాములు రోజువారిగా తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడ్డాడు. ఈ సంఘటనలో వెన్నుపూసకు తీవ్రగాయమవడంతో చికిత్స నిమిత్తం జనగామలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు.

హర్షణీయం

పాలకుర్తి టౌన్: రాజ్యసభ సభ్యుడిగా వద్దిరాజు రవిచంద్ర రెండోసారి నియామకం కావడం హర్షనీయమని మూన్నూరు కాపు సంఘం పాలకుర్తి నియోజవర్గ కోఆర్డినేటర్ వీరమల్ల రాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.